క్లుప్తంగా

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు సిటీ: బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. అనంతపురం జిల్లాకు చెందిన జ్యోతికి పులివెందులకు చెందిన రామాంజనేయులుతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త మృతి చెందడంతో జ్యోతి తన ముగ్గురు కుమార్తెలతో కలిసి నగరానికి వచ్చి చంద్రబాబునగర్ ఏ బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. రెండో కుమార్తె లక్ష్మీశైలజ గర్భిణి కావడంతో ఆమెతో పాటు చిన్న కుమార్తెను కదిరికి ఐదు నెలల క్రితం పంపారు. అనంతరం ఇంటికొచ్చిన లక్ష్మీశైలజ ఫోన్లో నిరంతరం మాట్లాడుతుండగా, అనుమానం వచ్చిన తల్లి నిలదీశారు. కదిరికి చెందిన గణేష్‌తో పరిచయమైందని, భర్త అంటే తనకు ఇష్టం లేదని, అతని స్నేహితుడైన మనోజ్‌తో చెల్లెలికి వివాహం చేస్తానని చెప్పారు. ఈ తరుణంలో గత నెల 28న ఇంటి నుంచి రెండో, మూడో కుమార్తెలు పారిపోయారు. దీంతో ఆందోళన చెందిన జ్యోతి తన రెండో కుమార్తెకు ఫోన్ చేయగా, తాము గణేష్, మనోజ్‌తో ఉన్నామని చెప్పారు. తాజాగా ఈ నెల ఒకటిన లక్ష్మీశైలజ, గణేష్ నెల్లూరొచ్చి చిన్న కుమార్తెను ఇంట్లో వదిలి వెళ్లిపోయారు. మనోజ్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని తల్లికి చెప్పారు. ఈ క్రమంలో వేదాయపాళెం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో మనోజ్‌పై పోక్సో కేసును నమోదు చేశారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన అవసరం



ముత్తుకూరు: ప్రథమ చికిత్సపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రథమ చికిత్స ఎంతో ఉపకరిస్తుందని ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ సంజయ్ కొత్త పేర్కొన్నారు. శుక్రవారం పోర్టులో లాజిస్టిక్ ఉద్యోగులు, కార్మికులకు ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఓఓ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స అందించే సమయంలో వ్యక్తిగత భద్రత పాటించాలన్నారు. నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బీ కృష్ణమూర్తి ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. పోర్టు సేఫ్టీ హెడ్ రామకృష్ణ మనీష్‌దేవ్, ఓంకార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి ఆర్థిక సాయం



వెంకటాచలం: మండలంలోని కనుపూరుకు చెందిన చినపెంచలయ్య కుటుంబానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం సాయంత్రం కనుపూరుకు వచ్చి అగ్నిప్రమాదంలో కాలిపోయిన చినపెంచలయ్య పూరింటిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి బియ్యం, దుస్తులతో పాటు కొంత నగదు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, శిఖామణి, తదితరులు ఉన్నారు.

నేత్రపర్వంగా చక్రస్నానం



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత తిరుచ్చి, అలకలతోపు ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం, తీర్థవాది నిర్వహించారు. రాత్రికి ధ్వజావరోహణం చేశారు. ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై వరదరాజస్వామి

జొన్నవాడలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అశ్వ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణం చేశారు. ఆలయ చైర్మన్ పిళ్లెళ్ల ప్రేమసాగర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



డానీహాల్లో శుభ శుక్రవార ఆరాధన



సెయింట్ జోసఫ్స్ క్యాథెడ్రల్ చర్చిలో..

నెల్లూరు(బృందావనం): గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని నగరంలోని ప్రధాన చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను శుక్రవారం నిర్వహించారు. సంతపేటలోని రోమన్ క్యాథలిక్ మిషన్ క్యాథెడ్రల్‌లో బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రత్యేకారాధనలు, ఏబీఎం కాంపౌండ్‌లోని లోన్‌స్టార్ మూడు సర్వీసుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని జెమ్స్ ఆఫ్ జీసస్ చర్చిలో రెవరెండ్ జెరోమ్ ఆధ్వర్యంలో ప్రత్యేకారాధనను నిర్వహించారు.

- సిలువపై యేసుక్రీస్తు పలికిన సప్తవాక్కుల ధ్యానాన్ని వీఆర్సీ సెంటర్ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డానీహాల్లో జరిపారు. సిలువ ధ్యానంపై సత్య క్రిస్టఫర్ రచించిన పాట ప్రత్యేకాకర్షణగా నిలిచింది. నగరంలోని పలు చర్చిల్లో ఆరాధనలను జరిపారు. గాయక బృందాలు ఆలపించిన క్రైస్తవ భక్తిగీతాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి.

యేసు క్రీస్తు కృప అందరికీ ఉండాలి

కపాడిపాళెంలోని సెయింట్ జోసఫ్స్ ఆర్సీఎం చర్చిలో నిర్వహించిన గుడ్ ఫ్రైడే ప్రార్థనలకు నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ హాజరయ్యారు. శిలువ మోసి, ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. యేసు క్రీస్తు కృప అందరికీ ఉండి మానవాళికి మంచి జరగాలన్నారు. కార్పొరేటర్లు సాహిత్య, రామకృష్ణ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.





సందేశమిస్తున్న బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం



ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలి



కరపత్రాన్ని అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 21వ డివిజన్లో కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్‌ను ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిందిగా పార్టీ నేతలు, కార్యకర్తలు, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లకు సూచించారు. ఇంటింటికీ వెళ్లి వారి స్పందనను తెలుసుకోవాలని.. ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే అందరి లక్ష్యమని తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించి.. వారికి కలిగిన లబ్ధిని తెలియజేశారు. కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, కార్పొరేటర్లు గౌరి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసయాదవ్, సత్తార్, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు సురేష్, పరమేశ్వరరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో వైద్య శిబిరం



నెల్లూరు(బారకాసు): రాజేంద్రనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ మహేంద్ర సౌజన్యంతో హోమియో మందులను ఉచితంగా అందజేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్, నేతలు కార్తీక్, సాయి, మునిబాలు, రత్నం, కమలేష్, పార్టీ నేత జగదీష్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థిక చేయూత



మాట్లాడుతున్న పద్మావతి

నెల్లూరు (వేదాయపాళెం): పద్దెనిమిదేళ్ల లోపు వయస్సు ఉండి నిరాదరణకు గురైన వారు, నిరాశ్రయులు, అనాథ బాలలకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ప్రతి నెలా రూ.నాలుగు వేల సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. బాలల సంరక్షణను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలను నిర్వహించి పథకంపై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను ఈ నెల 15లోపు అందజేయాలని కోరారు. మహిళా శిశు సంక్షేమాధికారులు పరిశీలించి అర్హుల వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నారని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



నెల్లూరు(బారకాసు): పారిశుధ్య కార్మికులను సన్మానించుకోవడం బాధ్యత అని మధ్యప్రదేశ్ విశ్రాంత అడిషనల్ చీఫ్ సెక్రటరీ రాజగోపాల్‌నాయుడు పేర్కొన్నారు. బీవీనగర్‌లోని వైఎల్ఎన్ కల్యాణ మండపంలో పారిశుధ్య కార్మికుల ఆత్మీయ సత్కార సభను సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆరెస్సెస్ రాష్ట్ర సహ కార్యవాహ యుగంధర్, జిల్లా మహిళా ప్రముఖ్ రమాదేవి, వెన్నెల, జయప్రద, జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవులు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీపురంలో ఇంటింటి ప్రచారం



నెల్లూరు రూరల్: జగనన్న నీవే మా నమ్మకం కార్యక్రమంలో భాగంగా ధనలక్ష్మీపురంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచార కరపత్రాలను స్థానికులకు శుక్రవారం అందజేశారు. అనంతరం వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వేణుగోపాల్‌రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ సుధాకర్, సచివాలయ కన్వీనర్ ఓబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా శనివారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనరసింహపురం, రామాలయ వీధి, బారాషహీద్ దర్గా, ఆదర్శనగర్, లేక్‌వ్యూ కాలనీ, సుజాతమ్మ కాలనీ, బ్రహ్మానందపురం, రాజగోపాలపురం, బెజవాడ ఓబుల్‌రెడ్డినగర్, బషీర్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- టౌన్‌హాల్ సెక్షన్ పరిధిలో గల వైఎంసీఏ, డీఆర్డీఏ సబ్‌స్టేషన్లలో స్విచ్‌లకు మరమ్మతులు చేపట్టనున్న తరుణంలో సోమశేఖరపురం, కాంప్లెక్స్ రోడ్డు, నాగులమిట్ట, సండే మార్కెట్, పొగతోట, బృందావనం, ట్రంక్‌రోడ్డు, ఆచారివీధి, రాయాజీవీధి, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని ఏఈ సుధాకర్ పేర్కొన్నారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలో కోదండరామస్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్టీఆర్ లేఅవుట్, ఉస్మాన్‌సాహెబ్‌పేట, రేబాలవారివీధి, పప్పులవీధి, ప్రకాష్‌నగర్, లక్ష్మీపురం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని స్టోన్‌హౌస్‌పేట ఏఈ సుకుమార్ తెలిపారు.

కోదండరాముడికి గజవాహనసేవ



నెల్లూరు రూరల్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా పాట్టేపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో గజవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటశేషారెడ్డి, శోభావతమ్మ, వెంకట్రామిరెడ్డి, వనజాక్షమ్మ దంపతులు వ్యవహరించారు. ఆలయ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటెంట్ ఫిల్మ్‌కు కళాకారులకు ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): డీఎస్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో నిర్మించనున్న కంటెంట్ ఫిల్మ్‌లో నటించేందుకు వర్ధమాన కళాకారులను ఆహ్వానిస్తున్నామని సంస్థ అధినేత బాలాజీశెట్టి పేర్కొన్నారు. సుబేదారుపేటలోని సంస్థ కార్యాలయంలో బ్రోచర్లను శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. యాక్టింగ్, డ్యాన్సింగ్, సింగింగ్, ఎడిటింగ్, తదితర అంశాలతో ఏదైనా కళను ప్రదర్శిస్తూ మూడు నిమిషాల నిడివిలో చిత్రించిన వీడియోను 63006 86067 నంబర్‌కు ఈ నెల 15లోపు పంపాలని కోరారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వేణుగోపాలుడి రథోత్సవం





నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి రథోత్సవాన్ని నేత్రపర్వంగా శుక్రవారం నిర్వహించారు. ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువైన వేణుగోపాలుడ్ని భక్తులు దర్శించుకున్నారు. రథానికి సంప్రదాయంగా పూజలు చేశారు. భక్తులకు శీతల పానీయాలు, మజ్జిగ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉభయకర్తలుగా రాఘవరావు దంపతులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పక విమాన అలంకారంలో స్వామి వారు రాత్రి దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటరాజు, సునీత దంపతులు, శశాంక్‌దత్ వ్యవహరించారు. ఈఓ చంద్రశేఖర్, వ్యవస్థాపక ధర్మకర్త చంద్రమౌళిరెడ్డి పర్యవేక్షించారు.

కనులపండువగా..



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గంగాదేవి, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి రథోత్సవాన్ని కనులపండువగా శుక్రవారం నిర్వహించారు. ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువైన మల్లేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు కార్తికేయశర్మ, మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఈఓ నవీన్‌కుమార్, తదితరులు పర్యవేక్షించారు.

పురమందిర వ్యవస్థాపక దినోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిర 108వ సంస్థాపక దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని టౌన్‌హాల్ ట్రస్ట్ బోర్డు సెక్రటరీ జేఎస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలార్క శిష్య బృందంతో సంగీత విభావరి, గురుకృప కళాక్షేత్ర సురభి గాయత్రి శిష్య బృందంతో శాస్త్రీయ సంగీత నృత్య విభావరిని సాయంత్రం ఆరు నుంచి నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ



నెల్లూరు(బృందావనం): గుడ్ ఫ్రైడే సందర్భంగా వీఆర్సీ సెంటర్ వద్ద మజ్జిగను ప్రపంచ మహిళలు, బాలల హక్కుల సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. సంస్థ కో కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, చైర్మన్ సంజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, యశ్వంత్, శ్రీకాంత్, ఆదిత్యసాయి, ఉపేంద్ర, అనుదీప్, లాబాన్, దేవప్రసాద్ పాల్గొన్నారు.

సెలవు దినాల్లోనూ పన్నులను చెల్లించొచ్చు

నెల్లూరు (బారకాసు): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులను శని, ఆదివారాల్లో సైతం చెల్లించొచ్చని కమిషనర్ హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో ప్రత్యేక కౌంటర్లు కార్పొరేషన్ కార్యాలయంలో యథావిధిగా కొనసాగనున్నాయని చెప్పారు. ముందస్తు పన్ను చెల్లింపులపై ఐదు శాతం రాయితీ ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అశ్వవాహనంపై అనంత కోదండరాముడు



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో నిర్వహిస్తున్న సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంతకోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామివారు అశ్వవాహనంపై శుక్రవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటసుబ్రహ్మణ్యం, స్వాతి దంపతులు, సుందర కుమార్, పద్మావతి దంపతులు వ్యవహరించారు.

వేడుకగా వసంతోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బారకాస్‌లోని శ్రీరామ మందిరంలో వసంతోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు, ఉభయకర్తలుగా హనుమంతరావు, సుధాకర్‌రావు వ్యవహరించారు. దేవస్థాన అధ్యక్షుడు శేషయ్య, సభ్యులు హనుమంతరావు, సత్యనారాయణ పర్యవేక్షించారు.

యాళివాహనంపై ఆంజనేయుడు



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో వసంతోత్సవం, యాళి వాహనసేవను నిర్వహించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

అక్షతారోహణ కల్యాణం



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో అక్షతారోహణ కల్యాణం, చప్పరోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు, మాధవి దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య ధర్మకర్తల మండలి చైర్మన్ రమణకుమార్, తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా అశ్వవాహనసేవ

నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో కోదండరామస్వామి, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వసంతోత్సవం, అశ్వవాహనసేవ, పారువేట ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మహి, బాబు, చంద్రమోహన్‌రెడ్డి, జ్యోతి దంపతులు వ్యవహరించారు.